# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక


## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు

- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 233 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | అక్టోబర్ 01-10-2024 | వెల : .రూ. 5.00




## దేవుళ్లతోనే రాజకీయాలా

- దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచండి
- శ్రీవారి లడ్డూలో కల్తీ జరిగిందని ఎలా గుర్తించారు
- లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగంపై ఆధారాలు ఉన్నాయా
- వివరాలు తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటిస్తారు
- ప్రస్తుత పరిస్తితుల్లో సిట్ దర్యాప్తుపై అనుమానాలు
- సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు

సెప్టెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) న్యూఢిల్లీ,
తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వివాదంపై సుప్రీంకోర్టు ఘాటుగా స్పందించింది. దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని హితవు పలికింది. లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారనడానికి ఆధారాలు ఏమైనా ఉన్నాయా అని ప్రభుత్వం తరపున న్యాయవాది ముకుల్ రోహత్గీని జస్టిస్ బి ఆర్ గవాయ్, జస్టిస్ కేవీ వి బాలకృష్ణన్ ధర్మాసనం ప్రశ్నించింది. కల్తీ నెయ్యిని లడ్డూలో వాడారో లేదో పూర్తిగా తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటన చేస్తారని సుప్రీంకోర్ట్ నిలదీసింది. ఈ అంశంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించిన

-మిగతా 2 లో



## మూసీ సుందరీకరణకు హైడ్రాకు సంబంధం లేదు

మూసీలో మార్కింగ్ కూడా మేం చేపట్టడం లేదు

ఇదంతా మూసీ రివర్ ఫ్రంట్ కార్యక్రమన్న రంగనాథ్



హైదరాబాద్, మూసీ సుందరీకరణపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదన్నారు. మూసీ నది

-మిగతా 2 లో



## రైతులను రోడ్డుకీడ్చిన ఘనత బీజేపీది


వీరు రైతుల గురించి మాట్లాడడమా బీజేపిది నేతల ధర్నాపై మండిపడ్డ తుమ్మల

హైదరాబాద్
కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం వెయ్యి ఎలుకలు తిన్న పిల్లి.. కాశీకి పోయినట్లుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. రైతులను రాజధాని వీధులకు ఈడ్చిన ఘనత బిజెపిదన్నారు. రైతు చట్టాలతో

-మిగతా 2 లో


## ఇళ్లు ఇస్తామని..
## ఇప్పుడు కూలుస్తారా

- మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్
- లక్షన్నర కోట్లు పెట్టి ఏం సాధిస్తారు
- మూసీలో పట్టాలు ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ
- నమామి గంగే ప్రాజెక్టుకే 40వేల కోట్లు
- సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కేటీఆర్



హైదరాబాద్,
మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆరోపించారు. లక్షన్నర కోట్లు కర్చు పెట్టి ఎవరిని ఉద్ధరిస్తారని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన సోమవారం మీడియాతో

-మిగతా 2 లో



## కాశ్మీర్‌లో నేడు తుదివిడత పోలింగ్

- ఓటు హక్కు వినియోగిం చుకోవాలన్న ఇసి

న్యూఢిల్లీ,
జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల మూడోవిడత పోలింగ్ మంగళవారం జరుగనుంది. ఈ మేరకు ఇసి అన్ని ఏర్పాట్లు చేసింది. మూడో విడత పోలింగ్ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కీలక సూచన చేశారు. ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అక్టోబర్ 1న తుది విడత పోలింగ్ జరుగనుంది. తొలి రెండు విడతల్లో రికార్డు స్థాయిలో పాల్గొన్న ఓటర్లకు రాజీవ్ కుమార్ అభినందనలు తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 58.58

-మిగతా 2 లో




## అక్టోబర్ 9న డీఎస్సీ
## నియామక పత్రాలు

- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏడువేల పోస్టులే భర్తీ
- ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందిస్తాం..
- ప్రస్తుతం 11,062 పోస్టులకు పోస్టులకు రిక్రూట్మెంట్
- 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు ఇచ్చాం
- డీఎస్సీ ఫలితాలు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి

సెప్టెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) హైదరాబాద్,
అక్టోబర్ 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ నియామక పత్రాలు అందజేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉదయం సచివాలయంలో డీఎస్సీ పరీక్షల ఫలితాలను సిఎం రేవంత్ విడుదల చేసారు. అనంతరం

-మిగతా 2 లో



## హైడ్రా బాధితులంతా తెలంగాణ పేదలే

సీఎం రేవంత్‌పై ముందు కేసులు పెట్టాలి

బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ విమర్శలు

సెప్టెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) హైదరాబాద్,
మూసీ-హైడ్రా వ్యవహారంలో నిజమైన బాధితులు తెలంగాణ పేద ప్రజలు అని.. అసలు నిందితుడు సీఎం రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మూసీ పేరుతో లూటీకి ప్లాన్ చేసి.. అడుగడుగునా జుగుప్సాకరమైన భాష వాడిన సీఎం రేవంత్ రెడ్డిపై ముందు కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులను సీఎం ఇంటి మీదకు పంపించండి.. పేదల ఇళ్లకు కాదని తెలంగాణ పోలీసులకు సూచించారు. హైడ్రా వ్యవహారంతో నష్టపోయిన బాధితులు సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేసిన వీడియోలను

-మిగతా 2 లో

## అవినీతితో కంపు కొడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు

- హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్




సెప్టెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) కరీంనగర్,
బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అవినీతితో కంపు కొడుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. కరీంనగర్ లో బండి సంజయ్ మాట్లాడారు. కాళేశ్వరం పేరుతో బిఆర్ఎస్ రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడితే, మూసీ పేరుతో కాంగ్రెస్ రూ.లక్షన్నర కోట్ల దోపిడీకి తెరతీసిందని ఆరోపణలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకే పైసల్లేవు కానీ మూసీ ప్రక్షాళన పేరుతో అప్పు తెచ్చి దోచుకునేందుకు కాంగ్రెస్ నేతలు

-మిగతా 2 లో

## ఉగ్రవాదానికి మన ప్రపంచంలో చోటు లేదు

- నెతన్యాహుకు వత్తాసు పలికిన మోడీ

సెప్టెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)న్యూఢిల్లీ
ఉగ్రవాదానికి మన ప్రపంచంలో చోటు లేదని ప్రధాని నరేంద్ర మోడీ సహచర ఇజ్రాయిలీ నేత నెతన్యాహుతో అన్నారు. ఇది ప్రాంతీయ ఉద్రిక్తతలకు దారి తీయకుండా నివారించడం, బందీలందరూ సురక్షితంగా విడుదలయ్యేలా చూడడం కీలకమని అన్నారు. ఉగ్రవాదులన్న ముద్ర వేసి హిజ్బుల్లా నాయకత్వాన్ని, అలాగే అనేక మంది అమాయక పౌరుల ప్రాణాలను బలిగొన్న యుద్ధోన్మాది నెతన్యాహు చర్యను మోడీ ఖండించడానికి బదులు దానిని బలపరిచేలా మాట్లాడడం పలు విమర్శలకు దారి తీసింది. పశ్చిమాసియాలో ఇటీవల జరుగుతున్న పరిణామాలు మన ప్రపంచంలో



-మిగతా 2 లో

## కాశ్మీర్‌లో నేడు తుదివిడత పోలింగ్

(మొదటి తరువాయి)

శాతం పోలింగ్‌తో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శాతాన్ని పోల్చారు. మొదటి విడతలో 61.38 శాతం, రెండో విడతలో 57.3 శాతం పోలింగ్ నమోదైనట్టు చెప్పారు. ఓటింగ్ శాతం, అభ్యర్థుల సంఖ్య, ప్రచారం గణనీయంగా పెరగడాన్ని తాము గమినించామని, రెండు విడతల్లోనూ ఎన్నికలను బహిష్కరించడం కానీ, రీపోలింగ్ కానీ చోటుచేసుకోలేదన్నారు. ఓటర్ టర్నవుట్ చరిత్రాత్మకమని చెప్పారు. మూడో దఫా పోలింగ్‌లోనూ గరిష్టంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సెప్టెంబర్ 18, 25 తేదీల్లో మొదటి రెండు విడతల పోలింగ్ జరుగగా, మంగళవారంనాడు 40 నియోజకవర్గాల్లో తుది విడత పోలింగ్ జరుగనుంది. అక్టోబర్ 8న ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయి.

## మూసీ సుందరీకరణకు హైడ్రాకు సంబంధం లేదు

(మొదటి తరువాయి)

పరిధిలో నివసిస్తున్న వారిని హైడ్రా తరలించడం లేదని, నదిలో ఎలాంటి కూల్చివేతలు చేపట్టడం లేదన్నారు. నదీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని, మూసీ సుందరీకరణ అనేది ప్రత్యేక ప్రాజెక్టని చెప్పారు. దానిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని వెల్లడించారు. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో ఇటీవల జరుగుతున్న కొన్ని ఆందోళనలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరణ ఇచ్చారు. నదీ పరివాహక ప్రాంతంలో నివాసితుల భద్రత, పునరావాసం, కూల్చివేతలకు సంబంధించిన వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో, కమిషనర్ కొన్ని ముఖ్యమైన వివరాలను వెల్లడించారు. మూసీ నదికి ఇరువైపులా జరుగుతున్న సర్వేలు హైడ్రాకు సంబంధించినవి కాదని స్పష్టంగా అవగాహన చేయాలని కోరారు. ఈ సర్వేలు హైడ్రా చట్టం లేదా ప్రాజెక్టుకు సంబంధించినవి కాదని తెలిపారు. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను హైడ్రా తరలించడం లేదని ఆయన స్పష్టం చేశారు. నివాసితులపై జరుగుతున్న ఇబ్బందులు తప్పనిసరిగా నివారించబడాలని హైడ్రా సంస్థ భావిస్తోందన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఎలాంటి ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని ఆయన తెలిపారు. ఇది నివాసితుల కష్టాలను, అసౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని చేయబడిన నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్నదని, ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతాన్ని అందంగా మార్చడం, పర్యావరణ సురక్షణపై దృష్టి సారించడం ద్వారా స్థానిక ప్రజలకు ప్రయోజనాలు అందించడం లక్ష్యంగా ఉందన్నారు. ఈ ప్రకటనలు, వాస్తవాలను స్పష్టం చేసేందుకు, ప్రజల భద్రతా ఆశలపై హైడ్రా సంస్థ కట్టుబడినట్టు తెలియజేయడానికి ఒక ప్రయత్నమన్నారు. ప్రజలు భద్రత కోసం కృషి చేయాలని, వాటిని మరింత నిశ్చితంగా, సహాయకరంగా చూడాలని కమిషనర్ కోరారు. ప్రజల, హైడ్రా సంస్థ మధ్య అనుబంధాన్ని మెరుగుపరచడం, స్థానిక అభివృద్ధికి దోహదం చేయడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని.. ఆయన సూచించారు.

## రైతులను రోడ్డుకీడ్చిన ఘనత బీజేపీది

(మొదటి తరువాయి)

ఎంతమంది ఉసురు తీసారో చెప్పగలరా అని ప్రశ్నించారు. చాలా మంది రైతులకు రుణమాఫీ జరగలేదని భాజపా నాయకులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన విడుదల చేశారు. 2022 కల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతుల ఆదాయం రెట్టింపు కాదు కదా.. గత పదేళ్లలో పెరిగిన ఖర్చులతో పోల్చుకుంటే నికర ఆదాయం పెరగని వాళ్లందరి సమాచారం మీ దగ్గర ఉందా? స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేసి.. రైతులను ఆదుకోవాలంటూ రాజధాని వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్న వారి విజ్ఞప్తులను ఎప్పుడైనా పట్టించుకున్నారా? భాజపా పాలిత రాష్ట్రాల్లో ఏ ఒక్క రాష్ట్రంలోనైనా రుణమాఫీ చేసి చూపించగలరా? రూ. లక్షల కోట్లు ఎగ్గొట్టిన పారిశ్రామికవేత్తల నుంచి నిధులు రికవరీ చేసి దేశవ్యాప్తంగా ఉన్న రైతుల రుణమాఫీ చేయగల నిబద్ధత మీకుందా? కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతులకు భరోసా కల్పించే బాధ్యత మాది. ఇప్పటికే సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాం. పంటలన్నింటినీ మద్దతు ధరకే కొనుగోలు చేసేందుకు ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని తుమ్మల పేర్కొన్నారు.

## ఉగ్రవాదానికి మన ప్రపంచంలో చోటు లేదు

(మొదటి తరువాయి)

ఉగ్రవాదానికి తావు లేదని తెలియజేస్తున్నాయని మోడీ తన మిత్రుడికి ఎక్స్ ద్వారా సందేశమిచ్చారు. ఈ ప్రాంతంలో వీలైనంత త్వరగా శాంతి, సుస్థిరతను పునరుద్ధరించేందుకు జరుగుతున్న యత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందన్నారు. గత వారం రోజులుగా లెబనాన్‌పై ఇజ్రాయిల్ పెద్దయెత్తున బాంబుల వర్షం కురిపించడం గురించి కానీ, హిజ్బులా చీఫ్ నస్రల్లాతో సహ అగ్ర నేతలను వరుసగా హత్య గావించిన నెతన్యాహు చర్యను కానీ మోడీ మాట మాత్రంగా కూడా అందులో ప్రస్తావించలేదు.

## హైడ్రా బాధితులంతా తెలంగాణ పేదలే

(మొదటి తరువాయి)

షేర్ చేశారనే ఆరోపణలతో కల్వకుర్తి మండలం కడ్తాలలో బీఆర్ఎస్ కార్యకర్త నరేశ్‌ను అరెస్టు చేయడంపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రికి రాత్రి పోలీసులను కడ్తాలకు పంపి నరేశ్‌ను అరెస్టు చేసి కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారని ఆయన తెలిపారు. నరేశ్‌తో పాటు అతని మిత్రులకు చెందిన 4 ఫోన్లను అక్రమంగా గుంజుకున్నారని మండిపడ్డారు. బీఎన్ఎస్ఎస్ 35(3) యాక్ట్ ప్రకారం నరేశ్‌ను బెయిల్‌పై రిలీజ్ చేసే అవకాశం ఉన్నప్పటికీ ఇంకా విడుదల చేయట్లేదని అన్నారు. అందుకే పోలీస్ స్టేషన్‌కు వచ్చామని వివరించారు. నరేశ్ ఒక్కడినే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా ఎంతోమంది పేద ప్రజలపై రాత్రికి రాత్రే కేసులు పెట్టారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇంకా ఎన్ని రోజులు, ఎంతమంది ప్రజలను ఇట్ల సతాయిస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించే 66 ఐటీ యాక్ట్ చెల్లదని ముంబై హైకోర్టు చెప్పిన తర్వాత కూడా ఇంకా జ్ఞానోదయం కాలేదా అని మండిపడ్డారు.

# దేవుళ్లతోనే రాజకీయాలా

(మొదటి తరువాయి)

అనంతరం కల్తీ నెయ్యిపై మీడియా ముందు ప్రకటన చేయడంపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటువంటి ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా నియమించిన సిట్ సరిగ్గా విచారణ జరపగలదా? అన్న సందేహాలు ఉన్నాయని న్యాయస్థానం పేర్కొంది. స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించినట్లు ఎలా తెలిసిందంటూ సుప్రీంకోర్ట్ సందేహం వ్యక్తం చేసింది. అలాగే స్వామి వారి ప్రసాదం లడ్డూని పరీక్షల కోసం ల్యాబ్‌కి ఎప్పుడు పంపారని ముకుల్ రోహాత్గిని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపితే బావుంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అనంతరం ఈ కేసు విచారణను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ బాలకృష్ణన్ ధర్మాసనం గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు తిరుమల లడ్డూ వివాదంపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. తిరుమల స్వామివారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించి నట్లు ఆరోపణలు నేపథ్యంలో ఈ అంశంలో నిజం నిగ్గా తేల్చాలంటూ బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి, వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వీటిపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిపింది. తత ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఎన్‌డీడీబీ నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘోర అపచారం జరిగిన నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో శాంతి హోమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించింది. అలాగే సంప్రోక్షణ కార్యక్రమాన్ని సైతం చేపట్టింది. అందులోభాగంగా ఆనంద నిలయంతో పాటు తిరుమల మాఢవీధుల్లో సైతం సంప్రోక్షణ నిర్వహించింది. మరోవైపు తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరపాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. గుంటూరు ఐజీ సర్వ శ్రేష్టి త్రిపాఠి నేతృత్వంలో సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో శనివారం సిట్ బృందం తిరుమల చేరుకుని.. తన దర్యాప్తును ప్రారంభించింది.

# అక్టోబర్ 9న డీఎస్సీ నియామక పత్రాలు

(మొదటి తరువాయి)

ఆయన మీడియాతో మాట్లాడుతూ కేవలం 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు ఇచ్చామని తెలిపారు. 1:3 నిష్పత్తిలో వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు. అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు ఇస్తామని ప్రకటించారు. పదేళ్లలో గత ప్రభుత్వం ఒకే ఒక్క డీఎస్సీ ఇచ్చిందని విమర్శించారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని, త్వరలోనే గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు ఇస్తామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. డీఎస్సీ 2024 ఫలితాలను విడుదల చేసిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరో గుడ్ న్యూస్ చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పరిస్థితులు ఖాళీలు చూసుకొని డీఎస్సీపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఉద్యోగ నియామక పక్రియ అనేది నిరంతరం సాగేదని అన్నారు. ఇప్పుడు డీఎస్సీ పక్రియ నియామక పక్రియ పూర్తి అయిన తర్వాత ఇందులో ఉన్న మిగిలిపోయే ఖాళీలు, కొత్తగా ఏర్పడే ఖాళీలు తెప్పించు కొని డీఎస్సీపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కచ్చితంగా ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకారమే ఉద్యోగాలు నియామకాలు జరుగుతాయన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఏ ఉద్యోగం కూడా ఖాళీ లేకుండా భర్తీ చేస్తామని అన్నారు. త్వరలోనే గ్రూప్ 1 రిజల్ట్స్ కూడా ఇస్తామన్నారు. గత ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసింది కానీ అక్కడ కనీస వసతులు కల్పించడంలో పూర్తి ఫెయిల్ అయిందన్నారు. పిట్టగూళ్లలో, పౌల్ట్రీ ఫామ్‌లో పేదల పిల్లలను వదిలేశారని ఆరోపించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయబోతున్నామని రేవంత్ ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికి ఇరవై నుంచి ఇరవై ఐదు ఎకరాలల్లో




ఈ విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ మైనార్టీ విద్యార్థులను ఒకే చోట విద్యను అందించబోతున్నామని తెలిపారు. యూనివర్సిటీ స్థాయిలో ఈ రెసిడెన్సియల్ స్కూల్స్ ఉంటాయని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద ముందుగా కొడంగల్, మధిరలో ఏర్పాటు చేస్తున్నామని ఇప్పటికే పనులు కూడా ప్రారంభమైనట్టు పేర్కొన్నారు. టెట్ తర్వాతనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. త్వరలోనే గ్రూప్ వన్ ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించారు. విద్యాశాఖ అధికారులు అతి తక్కువ సమయంలో ఉద్యోగాల భర్తీకి కృషి చేశారని అన్నారు. వారికి అభినందనలు తెలిపారు. 26ఆప్షన్ కింద డీఎస్సీ నిర్వహించామని వివరించారు. 1:3ప్రాతిపాదికన ఫలితాల ప్రకటించిన తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. దసరా లోపే 9అక్టోబర్ నాడు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకే ఒక్క నోటిఫికేషన్ వేసిందని మండిపడ్డారు.మాజీ సీఎం కేసీఆర్ కేవలం 7, 857 టీచర్లను మాత్రమే నియమించారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరి వల్ల పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య మీద పెట్టేది ఖర్చు కాదని తెలిపారు. పది నెలల్లోనే 11062 టీచర్ల భర్తీకి తాము కృషి చేశామని అన్నారు. ఇది తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని తెలిపారు.తమ ప్రభుత్వం వచ్చిన అనతికాలంలోనే 30వేల ఉద్యోగ పత్రాలు అందజేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతుందని హామీ ఇచ్చారు. గురుకులాల గురించి కేసీఆర్ చెప్పారని..కానీ మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. వంద నియోజక వర్గాల్లో యంగ్ ఇండియా ఇంటి గ్రెటెడ్ స్కూల్స్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ టీచర్ల పదోన్నతులు, బదిలీలు ఎందుకు చేయలేదని నిలదీశారు. దీని వల్ల టీచర్లలో నిరాశ ఏర్పడిందని చెప్పారు. 36వేల మంది టీచర్ల బదిలీలను ఎలాంటి విమర్శలు లేకుండా తాము పూర్తి చేశామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోలేదని.. దాని వల్ల కొంత సమస్యలు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

# ఇళ్లు ఇస్తామని..ఇప్పుడు కూలుస్తారా

(మొదటి తరువాయి)

మాట్లాడుతూ.. 'మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎంని ప్రశ్నిస్తున్నా. మేం మొత్తం దేశంలో ఉండే అన్ని ప్రాజెక్టుల వివరాలు తెప్పించాం. నామామి గంగే డీపీఆర్, ప్రాజెక్ట్ వివరాలు.. ప్రాజెక్టు పూర్వపరాలు తెప్పించాం. నమామి గంగే ప్రాజెక్టుపై ఆసక్తితో వివరాలు తెప్పించాను. 2400 కిలోమీటర్ల గంగానది ప్రక్షాళన కోసం కేంద్రం ఈ ప్రాజెక్ట్ స్టార్ట్ చేసింది. ఈ ప్రాజెక్టుకు పెట్టిన బడ్జెట్ రూ.40వేలకోట్లు. 2400 కిలోమీటర్ల గంగా నదికి రూ.40వేలుకోట్లు. 50 కిలోమీటర్ల మూసీ సుందరీకరణ కోసం ఈ ముఖ్యమంత్రి రూ.1.50లక్షలకోట్ల ఖర్చు అవుతుందని సీఎం చెబుతున్నారు. దీన్ని స్కామ్ అనక ఏమనాలి. దీనివెనుక ఉన్న మతలబు ఏంటీ? చెప్పాలి కదా. అనుమతులు ఇచ్చిన ఇండ్లను కూల్చడమంటే ప్రభుత్వానికి తన వ్యవస్థ మీద, తన యంత్రాంగం, పరిపాలనపై తనకే పట్టులేనితనానికి నిదర్శనం కాదా? అని అడుగుతున్నానన్నారు. మున్సిపల్ మంత్రిగా నేను ఎనిమిదేళ్లు పని చేశాను. కూల్చాల్సి వస్తే.. మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీస్‌ను. కమిషనర్ ఎక్కడ కుసున్నడో.. బుద్ధ భవన్ నాలామీదున్న ఉన్నది. దాంట్లోనే ఎలక్షన్ కమిషనర్ ఉన్నడు. హైడ్రా కమిషనర్ ఉన్నరు. అందులో ఉమెన్స్ కమిషన్ ఉన్నది. మొదట ఆ భవనం కూల్చాలి. రెండోది ఏ జీహెచ్ఎంసీ పర్మిషన్‌లు ఇస్తదో.. ఆ జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని కూల్చాలి. జీహెచ్ఎంసీ ఆఫీస్ కూడా నాలాపైనే ఉన్నది. మరి ఇతరులకు సుద్దులు చెప్పే ముందు ఇక్కడి నుంచే మొదలిపెట్టాలి. నాకు తెలిసి సీఎంకి అవకాశం ఇస్తే.. కొత్తగా కట్టుకున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం కూలుస్తడు. ఆయనో లక్ష్యం పెట్టుకున్నడు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా పెట్టుకున్నడు. సెక్రటేరియట్ చూడంగనే అందరికీ కేసీఆర్ గుర్తుకు వస్తడు. మొన్న గణపతి బొప్ప మోరియా అనుకుంటా వెళ్లారు. అక్కడికి రాంగనే కేసీఆర్ గుర్తుకు వచ్చిండు.. కేసీఆర్ పాటలు పెట్టంగనే ముఖ్యమంత్రికి ఇరిటేషన్ వస్తున్నది. మూసీ బాధితుల ఆక్రందనలు చేస్తున్నా.. ఇబ్బంది పడుతుంటే.. నిన్న మొన్నటి వరకు డైలాగ్‌లు కొట్టిన మీ అధినాయకులు ఎక్కడా? మీ రాహుల్ గాంధీ యేడీ? మీ ప్రియాంక గాంధీ ఎక్కడ? అని ప్రశ్నించారు. కాళేశ్వరం అనేది ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీస్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు. ఒక పంటకు 40లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ప్రాజెక్టు. పరిశ్రమలకు 10శాతం నీళ్లు వస్తాయి. హైదరాబాద్ మహానగరంతో పాటు వేలాది గ్రామాలకు తాగునీరు ఇచ్చే ప్రాజెక్టు. హైదరాబాద్ నెత్తిమీద శాశ్వతంగా ఒక కుండపెట్టినట్టే కరువు తీర్చే కల్పతురువు కాళేశ్వరం. కాళేశ్వరం కట్టం తర్వాత వరిసాగులో భారతదేశంలో తెలంగాణ టాప్. ఇది కాళేశ్వరం పుణ్యం కాదా? రూ.లక్షకోట్ల పెట్టుబడితో ఏం జరిగిందంటే.. తెలంగాణ వరిసాగులో టాప్‌గా నిలిచింది' అన్నారు. కాళేశ్వరంతో తాగునీటి సమస్య పోయింది. హైదరాబాద్‌కు తాగునీటి సమస్య రానే రాదు.

# అవినీతితో కంపు కొడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు

(మొదటి తరువాయి)

సిద్ధమయ్యారని విమర్శలు గుప్పించారు. హైడ్రా తీరుతో ప్రజలు అసహ్యించుకుంటున్నారని, ప్రజలకు నిలువ నీడ లేకుండా చేయడమే ఇందిరమ్మ పాలనా? అని ప్రశ్నించారు. అయ్యప్ప సొసైటీ కూల్చివేత పేరుతో బిఆర్ఎస్ వసూళ్లకు పాల్పడిందని, హైడ్రా పేరుతో కాంగ్రెస్ వసూళ్లకు తెరతీస్తోందని, పేదల ఇండ్లను కూలిస్తే హైడ్రాను అడ్డుకుంటామని బండి సంజయ్ హెచ్చరించారు. ప్రజలకు బిజెపి ఆయుధం కాబోతుందని, ప్రజలకు తమ ప్రాణాలను అడ్డుపెడతామని, మా ప్రాణాలు తీశాకే ప్రజల ఇండ్లపై దాడులకు వెళ్లాలని, హైడ్రా దాడులపై బిజెపి సింగిల్ గానే ఉద్యమం చేస్తుందని బండి సంజయ్ ప్రకటించారు. కుటుంబ వారసత్వ పార్టీలంటేనే అవినీతికి కేరాఫ్ అడ్రస్ అని, తమిళనాడులో తండ్రి ముఖ్యమంత్రి?కొడుకు డిప్యూటీ సిఎం అయ్యారని, కాంగ్రెస్, బిఆర్ఎస్, డిఎంకెతో సహ కుటుంబ పార్టీల్లో కార్యకర్తలకు ముఖ్య పదవులు ఇవ్వరా? అని ప్రశ్నించారు. కుటుంబ, వారసత్వ పార్టీలను బొంద పెట్టాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

# పడకేసిన పారిశుద్ధ్యం

సర్పంచుల పదవీకాలం ముగిసింది
సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువైంది
మున్సిపాలిటీలో సఫాయిల ఇష్టరాజ్యం నడుస్తుంది

మంచిర్యాల జిల్లా, సెప్టెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జన్నారం మండలం పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలో శ్రీలంక కాలనీలో పారిశుద్ధ్యం లోపిస్తుందని స్థానికులు వాపోతున్నారు. పొనకల్ గ్రామంలో సర్పంచ్ గా జక్కు భూమేష్ ఉన్నంతకాలం వారానికి ఒకసారి గ్రామపంచాయతీ సఫాయిలతో మురికి కాలువలలో పూడిక తీయించి ప్రతి వార్డ్ శుభ్రంగా ఉండేటట్టు ఏర్పాట్లు చేసే వారని సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత శ్రీలంక కాలనీలోని మురికి కాలువలలో పూడికతీత పనులు



అడపాదడపాగా కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సఫాయి కూలీలు ముందుగా ఉన్నవాటినే పూడికతీస్తూ మిగతా వాటిని అలాగే వదిలేస్తున్నారని రెండు, మూడు సార్లు సఫాయిలతో చెప్పిన రేపు మాపు అంటూ కాలం సాగదీస్తున్నారని సంబంధిత ఇన్చార్జి అధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి కారణం అని స్థానికులు వాపోతున్నారు. శ్రీలంక కాలనీలోని గౌడ్ రైస్ మిల్ నుంచి మార్కెట్ కమిటీ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్నటువంటి మురికి కాలువలను సర్పంచ్ పదవీ కాలం ముగిసినప్పటి నుంచి ఇప్పటివరకు శుభ్రం చేయకపోవడంతో కాలువలు (మట్టి) పూడికతో నిండిపోయి మురికి నీరు ఇళ్లలోకి వస్తుందని దీనిపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని మురికి కాలువలను శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## జోగులాంబ గద్వాల జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ




గద్వాల్ సెప్టెంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్): గద్వాల పట్టణంలోని సంతాన వేణుగోపాల స్వామి దేవాలయం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విహెచ్పి జిల్లా అధ్యక్షుడు ఫణి మోహన్ రావు మాట్లాడుతూ తిరుమల తిరుపతి లడ్డు పవిత్రతను నాశనం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బి.ఎస్ కేశవ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, బండల వెంకట్ రాములు,విజయ్, జగదీశ్వర్ రెడ్డి, ఈశ్వరయ్య విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నల్గొండ జిల్లాలో ఏసీబీ దాడులు..!



నలగొండ సెప్టెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నల్గొండ జిల్లా చింతపల్లిలో రూ. 6 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన పశు వైద్యాధికారి జీజే పాల్. బర్రెలహెల్త్ సర్టిఫికెట్ కోసం నసర్లపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు నుంచి రూ. 6 వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.


## బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి. లక్ష్మినారాయణ



గద్వాల్ సెప్టెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా వి. లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్ కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన కలెక్టర్ బి.యం. సంతోష్ ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంతకుముందు జిహెచ్ఎంసి, హైదరాబాదులో ల్యాండ్ అక్విజేషన్ విభాగంలో పనిచేసి జిల్లాకు అదనపు కలెక్టర్ గా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం అదనపు కలెక్టర్ గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాసరావు యధావిధిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ అక్విజేషన్ గా బాధ్యతలు నిర్వహిస్తారు. కలెక్టరేట్ ఏ.ఓ. వీరభద్రప్ప కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలుకుతూ, శుభాకాంక్షలు తెలియజేశారు.

## నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రారంభమైన నిరాహారదీక్ష....

నిరాహార దీక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు...



గద్వాల్ సెప్టెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నేడు నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిషేధిత మత్తు పదార్థాల బహిష్కరణకై ప్రజా అవగాహన కల్పించేందుకు గద్వాల పాత బస్టాండ్ నందు "ఒక్కరోజు నిరాహార దీక్ష" ను నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్ మరియు నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున దీక్షలో పాల్గొన్నారు.

## వికలాంగుడికి ఆర్థిక సహాయం




కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, సహృదయా ఫౌండేషన్ సహకారంతో, కుత్బుల్లాపూర్‌లోని రాజీవ్ గృహకల్పలో 34వ బ్లాకులో నివసిస్తున్న ఎం. శ్రీకాంత్ అనే వికలాంగునికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ప్రేరణ ఫౌండర్ శరత్ సుదర్శి మాట్లాడుతూ, "ప్రేరణ ఫౌండేషన్ పేద విద్యార్థులు, మహిళలు, వికలాంగులకు చేయూత నిచ్చేందుకు నిత్యం కృషి చేస్తోంది" అని అన్నారు. శ్రీకాంత్‌కు ఆర్థిక సహకారం అందించిన సహృదయా ఫౌండేషన్ ఫౌండర్ బిందు తాడివాకాకు ధన్యవాదాలు తెలియజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్, ఉపాధ్యక్షులు పసుల అంజయ్య పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ లో 6903 వేల కేసుల పరిష్కారం

రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లో నమోదైన 66 కేసులలో 17,01,816 నగదు రిఫండ్

మంచిర్యాల జిల్లా, సెప్టెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రాజీ మార్గాన కేసులను పరిష్కరించడానికి సెప్టెంబరు 28వ తేదీన నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ లో రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఆదేశాలు, సూచనల ప్రకారం పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులు రాజీ మార్గమే రాజమార్గంగా కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు, సిబ్బంది పకడ్బందీగా వ్యవహరించి 15 రోజుల నుంచి కేసులలో ఉన్న నిందితులు, కక్షిదారులకు సమాచారం అందించి వారికి అవగాహన కల్పించి లోక్ అదాలత్ లో రామగుండం కమిషనరేట్ పరిధిలో 6903 కేసులు పరిష్కరించడంలో చక్కగా వ్యవహరించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని రామగుండం పోలీస్



కమిషనర్ ఎం. శ్రీనివాస్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. జాతీయ మెగా లోక్-అదాలత్ లో భాగంగా రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 61 సైబర్ క్రైమ్ కేసులలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లో నమోదైన 5 కేసులలో కలిపి మొత్తం 66 కేసులలో 17,01,816 నగదు బాధితులకు ఇప్పించేందుకు కోర్ట్ ఆర్డర్ కాపీలను సంబంధిత బ్యాంక్ నోడల్ అధికారులకు పంపించినట్లు సీపీ తెలిపారు. లోక్ అదాలత్ లో పరిష్కరించబడిన కేసుల వారీగా వివరాలు ఎఫ్ ఐ ఆర్ కేసుల సంఖ్య (కాంపౌండబుల్) పరిష్కరించబడింది - 952, విపత్తు నిర్వహణ చట్టం కింద కేసుల సంఖ్య (ఈ పెట్టి కేసులు మాత్రమే)230, ఎంవి చట్టం కేసుల సంఖ్య డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులతో సహా 3112, విపత్తు నిర్వహణ చట్టం కేసుల సంఖ్య (ఈ - పెట్టీ కేసులు మాత్రమే) - 230, ఇ-పెట్టీ కేసుల సంఖ్య (విపత్తు నిర్వహణ చట్టం కేసులు మినహా) - 2609, ఎంవీ చట్టం కేసుల సంఖ్య డ్రంకెన్ డ్రైవింగ్ కేసులతో కేసులు - 6903 కేసులు ఉంటాయని తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈరోజు శంభీపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరగా, వారు సానుకూలంగా స్పందించారు. "ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం," అని శంభీపూర్ రాజు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటా

-: లక్ష్మీ నివాస్




శంషాబాద్, సెప్టెంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్) శంషాబాద్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శంషాబాద్ మండల్ టీఎస్ఎస్వో కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఎస్ఎస్వో రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీ నివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీ నివాస్ మాట్లాడుతూ, "సమాజంలో సమూల మార్పులు తీసుకువచ్చే శక్తి విద్యార్థుల్లో ఉంటుంది. ప్రజలు, యువత సామాజిక స్పృహను అలవార్చుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ప్రజలంతా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలి. చెట్లు లేకుంటే వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది, కాలుష్యం మానవ జీవన ప్రమాణాలు ప్రశ్నార్థకంగా మారతాయి. కాలుష్యాన్ని తరిమికొట్టాలంటే ప్రతి ఇంటి ఆవరణలో, వ్యవసాయ పొలాలలో మొక్కలు నాటాలి," అని సూచించారు.

# నారాయణపేట సమాచార హక్కు చట్టం-2005 అవగాహన సదస్సు

- సమాచార హక్కు చట్టం కమిషనర్లను నియమించాలి
- సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలి

-జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్

నారాయణపేట సెప్టెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నారాయణపేట జిల్లా కేంద్రంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగేండ్ల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శీల గార్డెన్ ఫంక్షన్ హాల్లో జరిగిన సమాచార హక్కు చట్టం - 2005 అవగాహన సదస్సు కార్యక్రమ సమావేశానికి లిసమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్‌లిముఖ్యఅతిథిగా పాల్గొని ,మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సెక్షన్ 3 ప్రకారం దేశ పౌరులందరూ సమాచారం పొందే హక్కు కలదు, సెక్షన్ 6(1) ప్రకారం సమాచారం కొరకు దరఖాస్తుదారులు వివిధ కార్యాలయాల్లో దరఖాస్తు




చేసుకోగా, 30 రోజులు ఇవ్వవలసిన సమాచారాన్ని కొన్ని నెలలు గడిచిన ఎలాంటి సమాచారం ఇవ్వక పోతే, సెక్షన్ 19(1) ప్రకారం మొదటి అప్పీల్ కూడా సమాచారం ఇవ్వట్లేదనీ, అలాగే సెక్షన్ 19(3) ప్రకారం రెండవ అప్పీల్ చేస్తే స్టేట్ కమిషన్ ఆఫీస్ లో కమిషనర్లు లేక వేల దరఖాస్తులు పరిష్కారం కావడం లేదన్నారు, ప్రభుత్వం వెంటనే కమిషనర్లను నియమించాలని , సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి రిషి కుమార్ ముదిరాజ్ ,ఆర్టీఐ పీసీ జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు, జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, నారాయణపేట జిల్లా ఇంచార్జీ ఎడ్ల కుర్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పంతిగి చిన్నయ్య , జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ,నారాయణపేట అసెంబ్లీ అధ్యక్షుడు గణేష్ , మక్తల్ అసెంబ్లీ అధ్యక్షుడు గోపాల్ , అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి మోహన్ గౌడ్ , అసెంబ్లీ కమిటీ సభ్యులు సంద కృష్ణ , వెంకటన్న, మురళి, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.